# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 16-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భారతదేశ సాంకేతిక భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో సెమీకండక్టర్ పరిశ్రమల పాత్ర కీలకమైనదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- దేశంలో ఎలాంటి పన్నుల వ్యవస్థ ఉండాలనే దానిపై విద్యావేత్తలు, పరిశోధకులు మేధోమథనం చేయాలని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ కోరారు.
- ఈపీఎఫ్‌ఓ వేతన పరిమితిని నెలకు 15 వేల నుంచి 25 వేల రూపాయలకు పెంచాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది.
- “స్వచ్ఛతా హి సేవా 2026” ప్రచార కార్యక్రమం దేశవ్యాప్తంగా రేపటి నుండి ప్రారంభమవుతుంది.

=======================

భారతదేశ సాంకేతిక భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో సెమీకండక్టర్ పరిశ్రమల పాత్ర కీలకమైనదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ప్రముఖ సీఈఓలతో ఈరోజు నిర్వహించిన సెమీకండక్టర్ రౌండ్‌టేబుల్ సమావేశానికి నరేంద్ర మోదీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారతదేశానికి ప్రతిభ, సాంకేతిక పరిజ్ఞాన స్వీకరణ మౌలిక సదుపాయాల విషయంలో బలమైన పునాది ఉందని గుర్తు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అంది పుచ్చుకునే విషయంలో అంతర్జాతీయంగా భారతదేశం అగ్రగామి కావాలని ఆకాంక్షించారు. భారతదేశ సాంకేతిక భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ప్రభుత్వం సెమీకండక్టర్ పరిశ్రమ మధ్య సన్నిహిత సహకారం అవసరమని స్పష్టం చేశారు. నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు కృత్రిమ మేధ క్వాంటం కంప్యూటింగ్ వంటి వర్ధమాన సాంకేతికతల్లో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాలని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. సెమీకండక్టర్ రంగంలో సాధించిన గణనీయమైన పురోగతిని ఆయన ప్రస్తావిస్తూ, ఈ వ్యవస్థ ఇప్పుడు ప్రాథమిక ప్రయత్నాల నుండి మరింత విస్తృత స్థాయికి, అవకాశాల దశకు చేరుకుంటోందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) వేతన పరిమితిని నెలకు 15 వేల నుంచి 25 వేల రూపాయలకు పెంచాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన కేంద్రమంత్రి వర్గ సమావేశం వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులకు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా అదనంగా 51 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఈపీఎఫ్ఓ పరిధిలోకి తీసుకుని రావాలన్నది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశ్యమని చెప్పారు. దీని వలన కార్మికులకు సామాజిక భద్రత మరింతగా ఉంటుందని ఆశిస్తున్నట్లుగా తెలిపారు. దీనిపై ప్రభుత్వానికి ఏటా సుమారు 11 వేల 339 కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నామని అన్నారు. సవరించిన వేతన పరిమితి రేపటి విశ్వకర్మ జయంతి నుంచి అమల్లోకి వస్తుందని అశ్వినీ వైష్ణవ్ వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా రేపటి నుండి `స్వచ్ఛతా హి సేవా-2026` ప్రచారం ప్రారంభమై అక్టోబర్ 17వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ ప్రచారంలో ప్రధానంగా స్వచ్ఛత కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, వ్యర్థాల నుండి సంపద వంటి కార్యక్రమాల ద్వారా స్వచ్ఛతతో సమృద్ధిని సాధించడం వంటి అంశాలపై దృష్టి సారిస్తారు. ఈ ఏడాది ప్రచార ఇతివృత్తం `స్వచ్ఛతలో భాగస్వామ్యం - స్వచ్ఛ భారత్ - వికసిత్ భారత్`గా ఉంది. స్వచ్ఛమైన అభివృద్ధి చెందిన వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో సమిష్టి భాగస్వామ్యం, ఉమ్మడి బాధ్యత ప్రాముఖ్యతను ఈ ఇతివృత్తం స్పష్టం చేస్తుంది. ఇదిలా ఉండగా 2017లో ప్రారంభమైన `స్వచ్ఛతా హి సేవా` ప్రచారం `స్వచ్ఛ భారత్ మిషన్`లో ఒక కీలకమైన భాగంగా నిలిచింది. ప్రతీ ఏటా దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ ప్రచారం తమ పరిసరాల పట్ల బాధ్యత వహించేలా స్వచ్ఛతా కార్యక్రమాలలో ప్రజలు చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం రాబోయే రెండు దశాబ్దాల్లో ఎలాంటి పన్నుల వ్యవస్థను కలిగి ఉండాలనే దానిపై విద్యావేత్తలు, పరిశోధకులు, మేధోమథనం చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కోరారు. బెంగళూరులో ఇంటర్నేషనల్ టాక్స్ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ ఫౌండేషన్ (ITRAF) `న్యూ ఏజ్ టాక్సేషన్` అన్న అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మెరుగైన పన్నుల విధానం మీద దేశంలో పరిశోధన జరగాలని సూచించారు. వికసిత్ భారత్ 2047 దిశగా దేశం పయనిస్తున్న తరుణంలో ఈ చర్చ అవసరమని అన్నారు. దేశంలో మంచి పన్నుల విధానం రూపుదిద్దుకోవడానికి నిపుణులు దిశానిర్దేశం చేయాలని నిర్మలా సీతారామన్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద షాజాద్ భట్టి నెట్‌వర్క్‌ను కేంద్ర ప్రభుత్వం ఒక ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. యువతతో పాటు చిన్న నేరాలకు పాల్పడే వారిని ఉగ్రవాదం వైపు ప్రేరేపించడంతో పాటు సరిహద్దుల గుండా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌లో కూడా పాలుపంచుకుంటోందని షాజాద్ భట్టి నెట్‌వర్క్‌ను యూఏపీఏ కింద ఒక ఉగ్రవాద సంస్థగా ప్రకటించినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలియజేస్తూ.. గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోల్‌కతాలో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో సేవా సంకల్ప్ అభియాన్ ప్రచారాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా రేపటి నుంచి అక్టోబర్ 17 వరకు ఈ కార్యక్రమాలు నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా కొనసాగుతుందని తెలిపారు. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి భాగస్వామ్య పక్షాలన్నీ కలిసి ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటాయని రాజ్‌నాథ్ సింగ్ తెలియచేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

సౌదీ అరేబియాలోని మక్కా సమీపంలో జరిగిన డ్రోన్ దాడిపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో ఈరోజు పాత్రికేయులతో నిర్వహించిన సమావేశంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ... సౌదీ అరేబియా భూభాగంపై జరిగిన దాడులను ప్రజల ప్రాణాలకు, మౌలిక సదుపాయాలకు ప్రమాదం కలిగించే చర్యలను భారత్ ఖండిస్తుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలతో ఈ నగరానికి ఉన్న ప్రత్యేక అనుబంధం దృష్ట్యా మక్కా సమీపంలో జరిగిన ఘటన ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ ప్రాంతంలో త్వరగా శాంతి, స్థిరత్వం పునరుద్ధరించబడాలని భారత్ ఆశిస్తోందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో ఉన్న నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (NIA) ప్రత్యేక న్యాయస్థానం జిరామ్ వ్యాలీ కేసులో దోషులుగా తేలిన 10 మందికి ఈరోజు మరణశిక్ష విధించింది. ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ సింగ్ రాజ్‌పుత్ ఈ తీర్పును వెలువరించారు. ఈ తీర్పుపై హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు దోషులకు 30 రోజుల గడువు ఇచ్చారు. 2013 మే 25న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా దర్బా పోలీస్ స్టేషన్ పరిధిలోని జిరామ్ వ్యాలీలో జరిగిన మావోయిస్టు దాడిలో పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో సహా 27 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ దాడిలో మరో 35 మంది గాయపడ్డారు. ఈ కేసులో NIA 150 మందికి పైగా వ్యక్తులపై ఎఫ్ఐఆర్ (FIR) నమోదు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులతో ఈరోజు నిర్వహించిన దృశ్య మాధ్యమ సమావేశంలో `స్వచ్ఛ సేవా ఆంకలన్` (SSA)ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య సేవల నిర్వహణను అంచనా వేయడానికి, పర్యవేక్షించడానికి రూపొందించిన వార్షిక, గ్రామ పంచాయతీ స్థాయి డిజిటల్ స్వయం-అంచనా విధానమే ఈ స్వచ్ఛ సేవా ఆంకలన్ అని జలశక్తి మంత్రిత్వ శాఖ తెలిపింది. స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) 2.0లో భాగంగా తాగునీరు పారిశుధ్య శాఖ దీనిని అభివృద్ధి చేసింది. క్షేత్రస్థాయిలో పారిశుధ్య సేవల నిర్వహణను బలోపేతం చేసేందుకు గ్రామ పంచాయతీలు, గ్రామ సభలు రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల అధికారుల భాగస్వామ్యానికి ఈ విధానం దోహదపడుతుందని జలశక్తి మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కర్ణాటక రాష్ట్రానికి చెందిన సీనియర్ నటుడు అనంత్ నాగ్‌కు భారతీయ చలనచిత్ర రంగంలో అత్యున్నత పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును కేంద్రప్రభుత్వం ప్రకటించింది. భారతీయ సినిమాకు ఆయన అందించిన విశేష సేవలను గుర్తిస్తూ... 2024 సంవత్సరానికి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఆయనను ఎంపిక చేసినట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) అధికారికంగా వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రాగల 24 గంటల్లో అండమాన్ నికోబార్ దీవులు, అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ, హర్యానా, చండీఘుర్, పంజాబ్, ఢిల్లీలలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. రాబోయే రెండు, మూడు రోజుల్లో బీహార్, జమ్మూ కాశ్మీర్, లడఖ్, జార్ఖండ్, ఒడిశా, రాజస్థాన్‌లలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో కూడా ఇదే విధమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయని ఐఎండీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =